



మంగళగిరిలో చంద్రబాబును కలవడానికి కలపర్రు టోల్‌గేటు వద్ద కార్లలో వెళ్తున్న నాయకులు

మద్దిపాటికి టిక్కెట్ ఇవ్వొద్దు

- జడ్పీ మాజీ చైర్మన్ బాపిరాజు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వర్గం డిమాండ్
- గోపాలపురం నియోజకవర్గం నుంచి 400 కార్లతో భారీ ర్యాలీ
- చంద్రబాబును కలిసి నివేదిక సమర్పించేందుకు పయనం

ద్వారకా తిరుమల/ఏలూరు టూటౌన్, జనవరి 12 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని గోపాలపురం నియోజకవర్గ టీడీపీలో ఇన్‌చార్జ్ మద్దిపాటి వెంకట్రాజు నియంత పోకడ, ఇతర పరిణామాలను అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు మాజీ జడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో పలువురు నేతలు కార్యకర్తలు సుమారు 400 కార్లలో భారీస్థాయిలో శుక్రవారం మంగళగిరి తరలివెళ్లారు. నియోజకవర్గ తాజా పరిస్థితిని ఒక నివేదికగా తయారు చేసి చంద్రబాబుకు అందజేయాలనుకున్నారు. కాని, ఆయన హైదరాబాద్‌లో ఉండటంతో టీడీపీ ప్రోగ్రాం కమిటీ చైర్‌పర్సన్ స్వాతికి అందజేశారు. టీడీపీ కంచుకోటగా భావించే ఈ నియోజకవర్గంలో కొన్ని నెలలుగా పార్టీలో కొంత స్తబ్దత నెలకొంది. జిల్లాలో టీడీపీ గెలుపు సునాయాసంగా ఉండే నియోజకవర్గాల్లో గోపాలపురం ప్రథమస్థానంలో ఉంది. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును పక్కనపెట్టి మద్దిపాటి వెంకట్రాజును నియమించిన నాటి నుంచి ఆయన వ్యవహార శైలిని, అభ్యర్థిత్వాన్ని ఓ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మద్దిపాటి అభ్యర్థిత్వాన్ని ఖరారుచేసిన నాటి నుంచి ఇది మరింత జటిలమైంది. ఈ నెల 27న నల్లజర్లలో చంద్రబాబు రా.. కదలిరా.. కార్యక్రమాన్ని తలపెట్టడం, అక్కడ మద్దిపాటిని టీడీపీ అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉండటంతో.. వ్యతిరేక వర్గ నాయకులు మద్దిపాటి వద్దన్న నినాదంతో ముందుగానే అధినేతను కలిసేందుకు మంగళగిరి తరలి వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం నియోజకవర్గం నుంచి వందలాది కార్లలో బయలుదేరారు.

ఆ నలుగురిపై చర్యలు తీసుకోండి

- టీడీపీ అధిష్ఠానానికి జిల్లా అధ్యక్షుడు గన్ని నివేదిక
- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక

పెదవేగి, జనవరి 12 : పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు హెచ్చరించారు. దుగ్గిరాలలో చింతమనేని క్యాంపు కార్యాలయంలో చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన గన్ని మాట్లాడుతూ.. 'దెందులూరు నియోజకవర్గంలో కొంతమంది వ్యక్తులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అలాంటి చర్యలను పార్టీ ఉపేక్షించబోదు. పార్టీ వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడుతున్న నలుగురిపై చర్యలు కోరుతూ పార్టీ అధినాయకత్వానికి ఫిర్యాదు పంపించాం'మని తెలిపారు. పార్టీ దెందులూరు నియోజకవర్గం పరిశీలకుడు చెన్నుపాటి గాంధీ మాట్లాడుతూ దెందులూరులో చింతమనేని గెలుపు ఖాయంగా కనిపిస్తున్న తరుణంలో ప్రభాకర్ గెలుపును అడ్డుకోవాలనే లక్ష్యంతో కొంతమంది వైసీపీ కోవర్టులు పనిచేస్తున్నారనే అనుమానం కలుగుతోందన్నారు. పార్టీ నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, రాయల ఉమామహేశ్వరరావు, అవిర్నేని శ్రీధర్ సుబ్రహ్మణ్యం, మాగంటి నారాయణ ప్రసాద్, మోరు శ్రావణి, గారపాటి రామసీత, నాగరాజు, ముప్పిడి చింతయ్య, సక్కు కుమారి, మోహన్, గుత్తా అనిల్, అనిల్, సురేష్, అడపా శ్రీను, శివమణి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్ తదితరులు

పెత్తందార్ల వైపే జగన్

- వైసీపీ అధిష్ఠానం నన్ను మోసం చేసింది
- ప్రతిఫలం ఆశించకుండా ఐదేళ్లు పనిచేశా..
- త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటన
- చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా ఆవేదన



కార్యకర్తల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎలీజా

చింతలపూడి, జనవరి 12 : 'వారి అడుగులకు మడుగులొత్తలేదని ఎంపీ కోటగిరి శ్రీధర్ వర్గం నాపై కక్ష గట్టి, సీఎం జగన్‌కు నాపై లేనిపోనివి చెప్పారు. నాకు సీటిస్తే ఓడిపోతానని పక్కదోవ పట్టించారు. పార్టీ పెద్దలు మా ఇద్దరిని కూర్చోబెట్టి సమన్వయం చేయలేదు. ఇప్పుడు నియోజకవర్గానికి ఇన్‌చార్జిని నియమించారు. అధిష్ఠానం నన్ను నడిరోడ్డుపై నిలిపింది. నాకు అన్యాయం జరిగింది. నా అనుయాయులతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటా' అంటూ చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి నియోజకవర్గ ఇన్‌చార్జిగా విజయరాజును నియమిస్తూ ప్రకటన రావడంతో ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఐదేళ్లుగా ఏదీ ఆశించకుండా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించినందుకు ఇదా ప్రతిఫలం అంటూ వైసీపీ అధిష్ఠానంపై మండిపడ్డారు. చింతలపూడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట మండలాల నాయకులు, కార్యకర్తలను పిలిపించి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించి చెప్పారు. తదుపరి కార్యాచరణ ఏమిటనే దానిపై వారితో చర్చించారు. కొద్దిరోజులుగా జిల్లాలో చింతలపూడి ఎస్సీ నియోజకవర్గంలో వైసీపీ టికెట్ ఎవరికి ఇస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇటీవల ఎలీజాను తాడేపల్లి పిలిపించి అమలాపురం ఎంపీగా పోటీ చేయాలని కోరారు. దీనికి ఆయన తిరస్కరించి తనకు ఇక్కడే విజయావకాశాలు ఉన్నాయని, అక్కడకు వెళ్లేది లేదని తేల్చి చెప్పారు. తర్వాత పార్టీలోని సీనియర్ నాయకులు, అభిమానులు ఎలీజాకే టికెట్ ఇవ్వాలంటూ ఇటీవల నాలుగు మండలాల నుంచి వంద కార్లతో తాడేపల్లిలోని ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని వెళ్లినా ఆయన కలవలేదు. పదే పదే జగన్‌ను కలిసినా ఫలితం లేకపోయింది. చివరికి ఇన్‌చార్జిగా విజయరాజును నియమిస్తూ గురువారం రాత్రి వచ్చిన ప్రకటనతో ఎలీజా తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. 'చింతలపూడి నియోజకవర్గంలో గతంలో వున్న వర్గ రాజకీయమే నన్ను రోడ్డున పడే విధంగా చేసింది. నాకు అన్యాయం జరిగింది. అన్యాయం చేసింది కూడా పార్టీలోని వర్గీయులే. నేను పెత్తందార్లకు దాసోహం అనలేదని, నాపై లేనిపోని మాటలుచెప్పి సీటు రాకుండా చేశారు. ఇప్పటికీ పార్టీకి విధేయుడిగానే ఉన్నా. చింతలపూడి పెద్ద నియోజకవర్గం. ఇక్కడ అనేక సమస్యలు ఉన్నాయి. రెండు పట్టణాల్లో కార్యాలయాలు పెట్టి ఇక్కడే నివాసాలు ఉండి ప్రజలకు ఐదేళ్లు పార్టీ విధేయుడిగా పని చేశాను. నా సొంత డబ్బులు కోటి రూపాయలతో రోడ్లు వేయించాను. పెత్తందారులకు, పేదలకు జరుగుతున్న పోటీ అని సీఎం జగన్ పదేపదే చెబుతుంటారు. కాని ఇక్కడ పెత్తందారుల వైపే జగన్ మొగ్గుచూపారు. ఏది ఏమైనా నేను మోసపోయాను. నన్ను నమ్ముకున్న వాళ్లకు న్యాయం చేయాలి. నా భవిష్యత్ కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. కార్యకర్తలతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటా' నంటూ ఆయన చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే నియోజకవర్గంలో విజయరాజును వైసీపీ ఇన్‌చార్జిగా నియమించడంతో రంగాపురంలోని సత్యనారాయణస్వామి ఆలయం, జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లి పూజలు జరిపించారు. నియోజకవర్గంలో ఏం జరగబోతుందని వైసీపీలో అందరూ ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు.

నాలుగేళ్ల తర్వాత ..



- సొంత నియోజకవర్గానికి ఎంపీ రఘురామకృష్ణరాజు
- సొంతూరిలో సంక్రాంతి సంబరాలు.. భారీగా స్వాగతం పలికేందుకు అభిమానుల ప్రణాళిక

భీమవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి):నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు సంక్రాంతికి తమ సొంతూరు భీమవరం రానున్నారు. నాలుగేళ్ల తర్వాత ఆయన సొంత గడ్డపై అడుగు పెట్టనున్నారు. ఎంపీ రాక కోసం ఆయన అభిమానులు ఎదురు చూస్తున్నారు. పార్టీలకతీతంగా ఆహ్వానించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీల్లో ఆయన అభిమానులున్నారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ మీదుగా జనవరి 13 విమానంలో రఘురామకృష్ణరాజు రాజమండ్రి చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు రాజమండ్రి విమానాశ్రయంలో దిగుతారు. అక్కడి నుంచి ర్యాలీగా భీమవరం తీసుకు రావడానికి ఎంపీ అభిమానులు ప్రణాళిక చేశారు. నాలుగు రోజుల పాటు భీమవరంలోనే ఎంపీ నివాసం ఉంటారు. సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారు. కోర్టు కూడా ఆయనకు ఊరట కలిగించేలా ఉత్తర్వులు ఇచ్చింది. ఆయనకు తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించింది. రఘురామకృష్ణంరాజు 2020 జనవరిలో భీమవరం వచ్చారు. ఏపీ నిట్ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. తర్వాత సీఎం జగన్‌తో ఏర్పడిన వివాదాల కారణంగా ఆయన తన సొంత నియోజకవర్గంలో అడుగు పెట్టలేదు. వచ్చేందుకు పలుమార్లు ప్రయత్నాలు చేసినా అధికార పార్టీ నాయకులే ఆయనపై దాడికి పన్నాగం పన్నారంటూ ఇంటెలిజెన్స్ నివేదికలు అందాయి. దీంతో విజయవాడ నుంచే మళ్లీ హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఆ తర్వాత భీమవరంలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా మరోసారి రావడానికి సిద్ధపడ్డారు. అప్పట్లో ప్రోటోకాల్ ప్రకారం ప్రధాని సభా వేదికపై ఆయనకు చోటు లభించాలి. కానీ ప్రొటోకాల్‌లో ఎంపీ పేరులేదు. మరోవైపు అరెస్ట్ చేస్తారన్న పుకార్లు షికార్లు చేశాయి. ప్రధాని వేదికపై ఆశీనులు కావడానికి ప్రోటోకాల్‌లో పేరు లేకపోవడంతో మార్గమధ్యం నుంచే మళ్లీ వెళ్లిపోయారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఢిల్లీ నుంచే ఎంపీ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఎన్నికల్లో తమ పార్టీ ఓటమి ఖాయమంటూ కుండబద్దలు కొడుతున్నారు.




రావిచర్లలో బరిని ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

బరుల ధ్వంసం

ద్వారకా తిరుమల/ ఉంగుటూరు/నూజివీడు టౌన్/ ఆగిరిపల్లి, జనవరి 12 : ద్వారకా తిరుమల, భీమడోలు మండలాల పరిధిలో సంక్రాంతి పండుగ పేరుతో ఎవరైనా కోడి పందేలు, ఇతర జూదాలు నిర్వహిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్ హెచ్చరించారు. తిమ్మాపురంలో ఏర్పాటు చేస్తున్న కోడిపందేల బరిని శుక్రవారం ఆయన ద్వారకా తిరుమల పోలీసులతో వెళ్లి ట్రాక్టరుతో దున్నించి ధ్వంసం చేశారు. ఉంగుటూరు మండలం చేబ్రోలులో ఎస్‌ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో కోడి పందేల బరులను ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రావిచర్లలో కోడిపందేల నిర్వహణకు ఏర్పాటు చేసిన బరులను నూజివీడు రూరల్ ఎస్‌ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌తో ధ్వంసం చేయించారు. జూద క్రీడలు నిర్వహిస్తే 83329 59175 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఆగిరిపల్లి మండలంలో కోడి పందేల బరుల ఏర్పాటు చేయడంపై 'పోలీసుల ఆదేశాలు బేఖాతర్' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఎస్‌ఐ నంబూరి చంటిబాబు స్పందించారు. తోటపల్లి, చిన్నాగిరిపల్లి మధ్య ఏర్పాటు చేసిన బరులను ట్రాక్టర్‌తో దున్నించి వేశారు. ఫెన్సింగ్‌లు తొలగించారు.

కోటి సంతకాల సేకరణ



ఏలూరు కలెక్టరేట్, జనవరి 12 : రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి హెచ్చరించారు. సమ్మె 32వ రోజుకు చేరింది. 24 గంటల రిలేదీక్షలు ఏడో రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం సీఎంకు కోటిసంతకాల సేకరణను డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య తొలి సంతకం చేసి ప్రారంభించారు. అనంతరం సభలో బేబిరాణి మాట్లాడారు. భోగి మంటల్లో షోకాజు నోటీసులను దహనం చేస్తామని, సంక్రాంతిని ఇళ్లల్లో కాకుండా వీధుల్లో చేస్తామని హెచ్చరించారు. లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విశైలజ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబురావు, కె.సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.లింగరాజు, డి.ఎన్.వి.డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి సీబీఏ, ఎఫ్ఏ పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 12 : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి బాలబాలికలకు ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు, ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ-3) పరీక్షలకు నిర్వహిస్తున్నట్టు డీఈవో పి.శ్యాంసుందర్, జిల్లా కామన్ పరీక్షల నిర్వహణ సంస్థ (డీసీఈబీ) కార్యదర్శి ఎ.సర్వేశ్వర రావు తెలిపారు అన్‌ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలలకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రశ్నాపత్రాలను మాత్రమే ఇస్తామన్నారు. హెచ్‌ఎంలు సంబంధిత ఎంఈవో నుంచి ప్రశ్నాపత్రాలను ఈనెల 20న తీసుకోవాలన్నారు.

పల్లెకు పోదాం చలో ..చలో





సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు పయనం

- పల్లెబాట పట్టిన పట్టణవాసులు
- ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఏలూరు రూరల్, జనవరి 12 : సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. పట్టణాలకు వచ్చి నివాసం ఉంటున్న వారంతా సొంతూళ్లకు పయనం అవుతున్నారు. పండుగ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సంక్రాంతి స్పెషల్ పేరుతో అన్ని ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతోంది. శనివారం నుంచి వరుస సెలవులు కావడంతో ఏలూరు కొత్తబస్టాండ్ పండుగకు వెళుతున్న ప్రయాణికులతో రద్దీగా మారింది. సొంతూళ్లకు వెళ్లేవారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ ఆర్ఎం వరప్రసాద్ తెలిపారు. ప్రయాణికులకు సాధారణ చార్జీలతోనే స్పెషల్ సర్వీసులు నడుపుతామన్నారు. ప్రయాణికుల అవసరాన్ని, రద్దీని బట్టి ఇంకా బస్సులను అందుబాటులో ఉంచుతామన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి 13వ తేదీ వరకు హైదరాబాద్ నుంచి ఈ మూడు డిపోల నుంచి 90 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ ఫుల్ అయింది. పండుగ అనంతరం 16 నుంచి 21వ తేదీ వరకు 50 సర్వీసులకు రిజర్వేషన్ ప్రారంభించారు. తిరుపతి, విశాఖపట్నం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా విజయవాడ వరకు బస్సులు నడుపుతున్నారు. రాను, పోను టిక్కెట్లు బుక్ చేసుకున్న వారికి పదిశాతం రాయితీ కల్పిస్తున్నారు.



ఏలూరు బస్టాండ్‌లో పండగ రద్దీ దృశ్యాలు

ఏటిగట్టు పనులు నీటిపాలు

- 50 మీటర్ల మేర నదిలో కొట్టుకుపోయిన గట్టు
- భయం గుప్పెట్లో పొన్నపల్లి వాసులు

నరసాపురం టౌన్, జనవరి 12: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వద్ద చేపట్టిన ఏటిగట్టు పనుల్లో డొల్లతనం బయటపడింది. సుమారు రూ.28 కోట్ల అంచనాతో చేపట్టిన గట్టు పటిష్ట పనులు ఇటీవల గోదావరిలో కొట్టుకుపోయాయి. సుమారు 50 మీటర్ల మేర గట్టుకు కోత పడింది. ప్రస్తుతం గట్టుపై ఉన్న 8మీటర్ల వెడల్పు రోడ్డు మాత్రమే మిగిలింది. ఇది కూడా క్రమంగా కోతకు గురవుతుండడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గోదావరి పక్కనే ఉన్న పొన్నపల్లి వాసులు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. 2022 జూన్‌లో గోదావరికి వరద పోటెత్తినప్పుడు పట్టణంలోని అమరేశ్వరస్వామి ఆలయం నుంచి బుడితల రేవు వరకు ఏటి గట్టు కోతకు గురైంది. అప్పట్లో రూ.50లక్షలు వెచ్చించి తాత్కాలికంగా అడ్డుకట్ట పనులు చేపట్టారు. 2022 నవంబరులో రూ.28 కోట్ల అంచనాలతో గట్టు పటిష్ఠ పనులకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. 2023 మే నెలలో పనులు చేపట్టారు. అమరేశ్వరస్వామి నుంచి బుడితలరేవు వరకు 100 మీటర్లు గట్టును పటిష్ఠపర్చి కోతకు గురికాకుండా రాళ్లతో గ్రోయిన్స్ ఏర్పాటు చేశారు. వాస్తవానికి అమరేశ్వర స్వామి ఆలయం నుంచి శ్మశానం వరకు 200 మీటర్లు గట్టు పటిష్ఠ పర్చాల్సి ఉండగా 100 మీటర్లు మాత్రమే ఇప్పటికి పూర్తయింది. ఇక్కడ వినియోగించిన రాళ్లు నాసిరకమైనవని, క్వాలీఫైడ్ క్వారీ నుంచి కాకుండా గుర్తింపులేని క్వారీ నుంచి రాళ్లను తీసుకొచ్చి పనులు చేపడుతున్నారంటూ మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆరోపణలు చేశారు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ఈపనులకు బినామీలుగా వ్యవ హరిస్తున్నారని, దీనిపై విచారణ చేయించాలని గత ఆగస్టులో జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించక పోవడం వల్ల నేడు చేపట్టిన కోట్లాది రూపాయల పనులు నీటిపాలయ్యాయి. ప్రస్తుతం వరద లేకుండానే వేసిన గట్టు 50 మీటర్లు కొట్టుకుపోవడం గమనార్హం. కోతకు గురైన ప్రదేశంలో తాత్కాలికంగా అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కోతకు గురైన గట్టును శుక్రవారం పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బండారు మరోసారి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరిపై ఫైర్ అయ్యారు. ముదునూరి బాధ్యత వహించాలని, చేసిన పనులపై విచారణ చేయించా లని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడు కొవ్వలి రామ్మోహన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ఏటి గట్టును పరిశీలించి విస్మయం వ్యక్తం చేశారు.

కోతకు గురైన గోదావరి ఏటిగట్టు





జిల్లాలో ఎన్నికల విధులకు 4 వేల మంది టీచర్లు!

- ఎన్ఐసీ ద్వారా వివరాలు పంపిన విద్యాశాఖ

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 12 : సార్వత్రిక ఎన్నికల విధులకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా నుంచి ఉపాధ్యాయుల వివరాలను పంపారు. ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను సేవలను వినియోగించుకోవాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ వివరాలను సేకరించిన నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఎన్ఐసీ) ద్వారా గురువారమే పంపినట్టు విద్యాశాఖవర్గాలు వెల్లడించాయి. జిల్లాలో ఎన్నికల విధులకు మొత్తం 10 వేల మంది సిబ్బంది అవసరమవుతారని అంచనా కాగా , వీరిలో గెజిటెడ్ ర్యాంకు వున్న ప్రధానోపాధ్యాయులు, తత్సమాన కేడర్ స్కేలులో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు కలిపి మొత్తం 4వేల మంది వివరాలను పంపించినట్టు వివరించాయి. టీచర్ల అర్హతలు, సీనియార్టీని బట్టి పోలింగ్ అధికారులు (పీవో)గా నియమించే అవకాశం ఉంది. ఉపాధ్యాయులకు ప్రభుత్వం పైవున్న వ్యతిరేకత దృష్ట్యా వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించేలా బోధనేతర పనుల నుంచి మినహాయింపు నిస్తూ కొన్ని నెలల క్రితం ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. టీచర్లస్థానే సచివాలయాల సిబ్బందిని నియమిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఎన్నికల విధులకు ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

ఐటీడీఏ అధికారులు, ఉద్యోగులకు
సంక్రాంతి సెలవుల్లేవా !

» నేటి నుంచి 15 వరకు పీఎం-జన్మన్ ప్రోగ్రాంకు అందుబాటులో ఉండాలని సర్క్యులర్ » ఎన్జీవో నేతల అభ్యంతరం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 12:సంక్రాంతి సెలవు దినాల్లో సైతం ఉద్యోగులను అందుబాటులో ఉండాల్సిందిగా జిల్లా యంత్రాంగం జారీ చేసిన ఆదేశాలపై ఏపీ జేఏసీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్జీవో నాయకులు తెలిపిన వివరాలివి.. కొండప్రాంతాల్లో నివసించే ప్రజల్లో రక్తహీనతతో పాల కారణంగా సికిల్‌సెల్ ఎనీమియా బారినపడిన వారిని గుర్తించేందుకు కేంద్రప్రభుత్వం జాతీయస్థాయిలో 'పీఎం-జన్మన్' పేరిట ఈనెల 13,14,15 తేదీల్లో చేపట్టిన సర్వేను జిల్లాలోని కే.ఆర్.పురం ఐటీడీఏ మండలాల్లో నిర్వహిస్తున్నారు. ఈ ప్రోగ్రాంకు ఐటీడీఏ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు మూడురోజులూ అందుబాటులో ఉండాలని గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ కే.ఆర్.పురం ఐటీడీఏ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండాల్సి ఉంటుందని ఏపీ జేఏసీ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్ పేర్కొన్నారు. హిందువుల అతిపెద్ద పండుగైన సంక్రాంతికి ఉద్యోగులు బంధువుల ఇళ్లకు వెళ్లడం, ఇతర ప్రాంతాలనుంచి ఇక్కడకు రావడం జరుగుతాయని, పితృదేవతలకు, మరణించిన కుటుంబపెద్దలకు ఆచారాలు సమర్పించడం వంటివి చేస్తారని ఈ నేపథ్యంలో సెలవు రోజుల్లోనూ విధులకు హాజరుకావాలని సర్క్యులర్ జారీచేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. శనివారం నుంచి మంగళవారం వరకు సెలవులను ప్రభుత్వం ఇచ్చిన విషయాన్ని విస్మరించారా అని ప్రశ్నించారు. జాతీయ కార్యక్రమమైనప్పటికీ రాష్ట్ర/స్థానిక పండుగలపై కేంద్రానికి తెలియజేసి మినహాయింపు లేదా మరోరోజుకి వాయిదా వేసుకోవడానికి జిల్లా అధికారులకు వెసులు బాటు ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ సెలవుదినాల్లో పనిచేయాల్సి వస్తే ఆ మేరకు సరిపడా ఇతర రోజుల్లో సెలవు తీసుకునేలా స్పెషల్ క్యాజువల్ లీవు ఇవ్వాల్సి ఉంటుందని, దీనిని కూడా పట్టించుకోకుండా కేఆర్.పురం ఐటీడీఏ అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి శనివారం తీసుకెళ్లి పీఎం-జన్మన్ ప్రోగ్రాంను జిల్లాలో వాయిదా వేయడం లేదా ప్రత్యేక క్యాజువల్ లీవులు ఇచ్చేలా కోరతామని హరనాథ్ వివరించారు.

జడ్పీ పీఎఫ్ ఖాతాల్లో సాంకేతిక సమస్యల పరిష్కారానికి అంగీకారం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 12 :జడ్పీ ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాలను అందుబాటులో ఉంచాలని అభ్యర్థిస్తూ శుక్రవారం జడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్. సుబ్బారావుతో ఏపీటీఎఫ్, పీఆర్టీయూ జిల్లానాయకులు జరిపిన చర్చల్లో అంగీకారం కుదిరింది. వివరాలను సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, పి.ఆంజనేయులు, బి.రెడ్డిదొర తెలిపారు. వచ్చే మార్చి 31నాటికి పీఎఫ్ ఖాతాలన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌డేట్‌చేసి టీచర్లకు అందుబాటులో ఉంచేందుకు అధికారులు అంగీకరించారని తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విభజన (మూడు జిల్లాలు)కారణంగా వేరే జిల్లాలో వున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల నెలవారీ చందాకు సంబంధించిన నగదును ఏలూరు జిల్లా ఖాతాలోకి బదిలీ చేసిన నేపథ్యంలో ఏర్పడిన సాంకేతిక సమస్యను త్వరలోనే పరిష్కరించి ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లిస్తారని వివరించారు. మూడేళ్ళుగా పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లను విడుదల చేయడం లేదని, తక్షణమే వాటిని విడుదలచేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. పీఎఫ్ రుణాలు మంజూరుచేసే విషయంలో ఇబ్బందులు పెట్టవద్దన్నారు. గతేడాది ఏప్రిల్‌లో మంజూరైన పీఎఫ్ రుణాల నగదు మొత్తాలు ఇంతవరకు సంబంధిత టీచర్ల బ్యాంకు ఖాతాలకు జమ చేయకపోవడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నందున సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. చర్చల్లో సంఘ ఏలూరురూరల్ అధ్యక్షుడు రామశేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయంలో కూడారై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పారిజాత గిరిలో కూడారై ఉత్సవం

జంగారెడ్డిగూడెంటౌన్, జనవరి 12:గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కూడారై మహోత్సవ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అందంగా తీర్చిదిద్దిన రంగవల్లికలో 108 గంగాలాలతో అక్కార్ అడిషల్ ప్రత్యేక ప్రసాదాన్ని గోదా సమేత శ్రీరంగనాథ స్వామికి నివేదనగా సమర్పించినట్టు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు గోదా శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. చిన్నారులకు వికాస్ తరంగిణి, వాసవి ఫ్యాన్సీ వారి సౌజన్యంతో బహుమతులు అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ వందనపు సాయిబాలపద్మ, అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు, వాసవి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మావుళ్ళమ్మ ఉత్సవాల్లో..

భీమవరంటౌన్, జనవరి 12 : మావుళ్ళమ్మ అమ్మవారి 60 వార్షిక మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 5.05 నిమిషాలకు రామాయణం గోవిందరావు, వెంకటేశ్వరి దంపతులచే కలశస్థాపన, అమ్మవారికి కుంకుమ పూజలు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభం. బాలాగోపి మ్యూజికల్ బ్యాండ్ ట్రూప్‌తో ఊరేగింపు. సాయంత్రం 4 గంటలకు కోటికలపూడి గోవిందరావు కళావేదికపై మునిసిపల్ కమిషనర్ ఎం. శ్యామల చేతుల మీదుగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం. సాయంత్రం 5 గంటలకు తుమ్మ నాగమణి(మల్లవేలు)చే హరికథ, రాత్రి 8 గంటలకు శ్రీశ్రీరాజరాజేశ్వరి నాట్యమండలి (గుడివాడ) వారిచే కనకదుర్గ మహాత్యం నాటకం.

క్రికెట్‌లో రాణించాలంటే ఎంతో కష్టపడాలి

» ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ టాలెంట్ కమిటీ సభ్యుడు మంగేశ్



భీమవరంటౌన్, జనవరి 12 : యువత క్రికెట్‌లో రాణించాలంటే ఎంతో కష్టపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధించడం సాధ్యం కాదని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ టాలెంట్ కమిటీ సభ్యుడు మంగేశ్ స్పష్టం చేశారు. భీమవరంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో శుక్రవారం మాట్లాడా రు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-14, అండర్-16 క్రీడాకారులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఒకప్పుడు రంజీ క్రికెట్‌లో ఆడానని, ప్రస్తుతం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ టాలెంట్ కమిటీలో సభ్యుడిగా కొనసాగుతున్నా నన్నారు. క్రికెట్ పోటీలు నిర్వహించే ప్రాంతానికి వెళ్లి తమ కమిటీ సభ్యులు ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి అసోసియేషన్‌కు జాబితా అందిస్తామన్నారు. ఈవిధంగా ఎంపిక చేసిన క్రీడాకారులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తారన్నారు.

ఉభయ గోదావరి జిల్లాలో సబ్ సెంటర్లు

యువ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు ఉభయ గోదావరి జిల్లాలోని భీమవరం, ఏలూరులో సబ్ సెంటర్‌లు ఉన్నాయి. మంచి కోచ్‌లు కూడా ఉన్నారని వారు ఉచితంగా క్రీడాకారులకు శిక్షణ ఇస్తారన్నారు. క్రికెట్‌పై ఆసక్తి గలవారు ఈ సబ్ సెంటర్లను వినియోగించుకోవాలన్నారు.

180 మంది బైండోవర్

ముసునూరు, జనవరి 12: సంక్రాంతి సంద ర్భంగా కోడిపందేలు, ఇతర జూద క్రీడలు జరగ కుండా ముందస్తుగా పాత ముద్దాయిలను బైండోవర్ చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. శుక్రవారం నాటికి మండల పరిధిలో కోడి పందేల నిర్వహణ, కోడి కత్తుల తయారీ, కోళ్లకు కత్తులు కట్టేవారు 180 మంది పాత ముద్దాయిలను బైండోవర్ చేశామని తెలిపారు. సంప్రదాయం ముసుగులో కోడిపందేలు, జూదం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

సహకార రంగానికి ఉరి!



సహకార రంగాన్ని చావుదెబ్బతీసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా అసెంబ్లీలో బిల్లును ఆమోదించింది. రైతులకు ఎంతగానో ఉపయోగపడే సహకార రంగంలో ప్రైవేట్ పెట్టుబడుల పెట్టేలా చీకటి ప్రయత్నాలు చేస్తోందంటూ సొసైటీ ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఇది కాస్త ప్రైవేటుకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే సిబ్బందిపై కక్షగట్టే ప్రమాదం ఉందంటూ మరోవైపు ఆందోళన చెందుతున్నారు. ప్రశ్నించే వారి గొంతునొక్కే ప్రయత్నాలను ప్రభుత్వం చేస్తుండడంతో సహకార సంఘాల్లో ప్రైవేట్ పెట్టుబడులకు మార్గం సుగుమం అవుతోంది. దీనిపై రైతులు, నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగుల భద్రత కూడా ప్రశ్నార్థకం కానుంది.
- తాడేపల్లిగూడెం రూరల్

ప్రైవేటు పెట్టుబడులకు ప్రభుత్వ ప్రోత్సాహం

» ప్రశ్నించలేని త్రిసభ్య కమిటీలు
» ఆందోళనలో రైతులు, ఉద్యోగులు

త్రిసభ్య కమిటీలతో ప్రభుత్వ పెత్తనం

వైసీపీ ప్రభుత్వంలో సహకార సంఘాలు స్వేచ్ఛను కోల్పోయాయి. ప్రభుత్వ నిర్ణయాలకు తందాన కొడుతున్నాయి. ఎన్నికలు లేవు. ఓటు వేసే ప్రాథమిక హక్కును రైతులు కోల్పోయారు. సహకార చరిత్రలో లేనివిధంగా త్రిసభ్య కమిటీలను ప్రభుత్వమే నియమిస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇదేతంతు సాగుతోంది. ఎన్నికల ద్వారా గతంలో పాలకవర్గ నియామకం జరిగేది. రైతులకు అనుకూల నిర్ణయాలు తీసుకునేవారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం పొందేలా పాలకవర్గాలు కృషి చేసేవి. ఇప్పుడు అధికార పార్టీ నాయకులను, కార్యకర్తలను త్రిసభ్య కమిటీలో నియమిస్తున్నారు. వారే సహకార సంఘాలను శాసిస్తున్నారు. సొసైటీలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా సరే ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రైవేటు పెట్టుబడుల విషయంలోనూ అదే జరుగుతోంది. ప్రైవేటు సంస్థలు ఒక్కసారి సహకార రంగంలోకి వస్తే సన్న, చిన్న కారు రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. లాభార్జనే ధ్యేయంగా సొసైటీలు వ్యవహరించనున్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకులే సొసైటీల్లో త్రిసభ్య కమిటీ చైర్మన్‌లుగా వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. ప్రశ్నిస్తున్న ఉద్యోగులను అణచివేసేందుకు ప్రభుత్వం తన అధికారాలు వాడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ జల్లాలో ఉన్న 260 సహకార సంఘాలున్నాయి. ఒకసారి ప్రైవేట్ పెట్టుబడులు వస్తే సహకార సంఘాలతోపాటు, వాటికి నిధులు సమకూర్చే డీసీసీబీలు, ఆప్‌కాబ్‌ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

సహకార సంఘాలకు పెనుముప్పు

సహకార రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు ప్రభుత్వం బిల్లును ఆమోదించింది. అది అమలు జరిగితే సహకార రంగంలో 50 శాతం ప్రైవేట్ పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉంటుంది. సహకార వ్యవసాయ పరపతి సంఘంలో 50శాతం వాటాలోకి ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలు, చిట్ ఫండ్ సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్ వంటి నిధులు కలిగిన సంస్థలు పెట్టుబడులు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. కనీసం రూ.50లక్షలు నుంచి సొసైటీ టర్నోవర్‌లో 50శాతం వరకు పెట్టుబడులు పెట్టేందుకు బిల్లు అవకాశం కల్పిస్తోంది. అంతకు మించి సొసైటీలో పెట్టుబడులు పెట్టాలనుకుంటే గ్రాంట్‌ల రూపంలో ఇవ్వవచ్చు. అయితే 50 శాతం పెట్టుబడులు పెట్టే సంస్థలకు ఓటింగ్ హక్కుకూడా ఉంటుంది., దీంతో ఈ ప్రైవేటు సంస్థలు తమ లాభాల కోసం సహకార రంగాన్ని ఓటింగ్ ద్వారా శాసించే అవకాశం ఉంటుందని రైతులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు సంస్థలకు 50 శాతం ఓటింగ్ హక్కు ఉంటే సహకార నిర్ణయాలు డబ్బుతోనే శాసించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది సహకార రంగానికి ప్రైవేటు తాడుతో ఉరివేయడమేనంటూ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

నోరుమెదపలేని నాయకులు

గతంలో సహకార సంఘాల పాలక వర్గాలను రైతులు ఎన్నుకునే వారు.. ఆవిధంగా ఎన్నికైన అధ్యక్షులు, డైరెక్టర్‌లు వ్యవసాయానికి అవసరమైన వాటిని అందించేందుకు ముందుండేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థను నామినేటెడ్ వ్యవస్థగా మార్చింది. పార్టీ నాయకులనే త్రిసభ్య కమిటీగా వేసి ప్రభుత్వ ఆధిపత్యం చలాయిస్తోంది. ఈ సమయంలో ఈ సహకారరం గతంలో ప్రైవేటు పెట్టుబడులు పెట్టడం అంశాన్ని వ్యతిరేకించే నాయకుడు కరువయ్యారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఇచ్చిన కమీషన్‌ను పక్కదారి పట్టించినాసరే త్రిసభ్య కమిటీలు ప్రశ్నించ లేదు. ఒక దశలో కమీషన్‌ను రైతులకు ఇవ్వాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. ఆ సొమ్ములు అధికార పార్టీ నేతలే దిగమింగారు. త్రిసభ్య కమిటీలు ఏమీ చేయలేకపోయాయి. ఇప్పుడు కూడా ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదు. దీనిపై త్రిసభ్య కమిటీలు ప్రశ్నించలేని దుస్థితిలో ఉన్నాయి. ఒక విధంగా సొసైటీలు స్వతంత్రను కోల్పోయాయి. ప్రభుత్వ కనుసన్నల్లో నడుస్తున్నాయి.

అమరావతి ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

» జెండా ఊపిన ముదునూరి, రైల్వే అధికారులు



అమరావతి రైలు, జెండా ఊపుతున్న చీఫ్ విప్ ముదునూరి, ఏడీఆర్ఎం

నరసాపురం, జనవరి 12:నరసాపురం-హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవం నరసాపురం రైల్వేస్టేషన్‌లో కోలాహలంగా జరిగింది. గుంటూరు స్టేషన్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అదే సమయంలో నరసాపురం రైల్వేస్టేషన్ ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీను, రైల్వే ఏడీఆర్ఎం శ్రీనివాసరావు జెండా ఊపి గ్రీన్‌సిగ్నిల్ ఇచ్చారు. బీజేపీ, సీపీఎం, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త ఎక్స్‌ప్రెస్‌లు నడపాలి

డబ్లింగ్ లైన్ పనులు పూర్తయినందున పెండింగ్‌లో ఉన్న కొత్త రైళ్లను పట్టాలెక్కించాలని ముదునూరి ప్రసాదరాజు కోరారు. ఆయన మాట్లాడుతూ నరసాపురం-విశాఖ, బెంగళూరు, వారణాశి రైళ్లను కూడా త్వరలో ప్రారంభించాలన్నారు. రైల్వే ఏడీఆర్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో మరికొన్ని రైళ్లను నడిపేందుకు ప్రయత్నిస్తామని, విశాఖరైలును పునరుద్ధరిస్తామన్నారు. టీడీపీ కౌన్సిలర్ పాలూరి బాబ్జి, కలిగినీడి కుమార్, ఎస్ఎంలు మధుబాబు, దివాకర్, చైర్‌పర్సన్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకం



నిట్‌లో వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 12 : వివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. ఏపీ నిట్ ప్రాంగణంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ యువతలో చైతన్య స్ఫూర్తిని రగిలించిన మహోన్నత వ్యక్తి స్వామివివేకానంద అన్నారు. ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



చెక్‌పోస్టు వద్ద ఎస్పీ మేరీప్రశాంతి ఎస్ఈబీ, పోలీస్ అధికారులు

జీలుగుమిల్లి, జనవరి 12 : రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పనిచేసే సిబ్బంది విధ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. తాటియాకులగూడెం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ విషయమై శుక్రవారం ఆరా తీశారు. సంక్రాంతి, త్వరలో వచ్చే ఎన్నికల కోడ్ దృష్టిలో ఉంచుకుని మద్యం, నాటుసారా ఇతర మాదక ద్రవ్యాలుతరలి పోకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్ఐ వి.చంద్రశేఖర్, ఎస్ఈబీ ఎస్ఐ మస్తానయ్య, సిబ్బంది ఆర్.శ్రీనివాస్, ప్రవీణ్, షాను ఉన్నారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మరో 27 సీసీ కెమెరాలు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న టెక్నీషియన్లు

ఏలూరు క్రైం, జనవరి 12 :ఏలూరు ప్రభుత్వాసుపత్రి టీచింగ్ ఆసుపత్రిగా మారడంతో రక్షణ చర్యల్లో భాగంగా 27 అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని సీసీ కెమెరాలు ఉన్నప్పటికి సరిగా పనిచేయడం లేదు. కొన్ని ప్రాంతాల్లో కవరేజీ లేకపోవడంతో ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు అధికారులు గుర్తించారు. తల్లీబిడ్డల విభాగపు ప్రాంతంలోనూ అక్కడే ఉన్న మెడికల్ కళాశాల విద్యార్థినుల హాస్టల్స్ వద్ద కూడా కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఆ ప్రాంతంలో 8 కెమెరాలు ఏర్పాటు చేస్తు న్నారు. మిగిలిన 19 కెమెరాలు ఆసుపత్రి విభాగంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులన్నీ వారం రోజుల్లో పూర్తి చేయనున్నారు.

'జడ్పీ'లో రూ.90.5 లక్షలతో ఆధునికీకరణ పనులు



పనుల శంకుస్థాపనలో ఘంటా పద్మశ్రీ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 12: జడ్పీ కార్యాలయంలో రూ.90.5 లక్షలతో చేపట్టిన ఆధునికీకరణ పనులకు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది పనిచేసే ప్రదేశంలో ఆహ్లాదకరమైన వాతా వరణం కల్పించేందుకు పలు విభాగాలను ఆధునికీకరిస్తున్నట్టు తెలిపారు. సిబ్బంది మరింత శ్రద్ధతో పనిచేసేం దుకు అవకాశం ఉంటుందన్నారు. నిడదవోలు జడ్పీటీసీ కె.సూర్యారావు, జడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్ సుబ్బారావు, డిప్యూటీ సీఈవో ఎన్.నిర్మలజ్యోతి, పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజినీర్ కేదారేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బిల్డింగ్ పైనుంచి పడి పెయింటర్ మృతి

ఏలూరు క్రైం, జనవరి 12 : బిల్డింగ్‌కు సున్నం వేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కె.మరియదాసు (40) కొంతకాలం నుంచి ఏలూరు తూర్పువీధిలో ఒక రూమ్‌ను అద్దెకు తీసుకుని ఒంటరిగా ఉంటూ పెయింటింగ్ పనులకు వెళ్తున్నారు. ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని పెయింటింగ్ పనులు చేయడానికి శుక్రవారం ఉదయం వెళ్లారు. ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి జారి కింద పడి తీవ్ర గాయాలకు గురికాక వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి మరియదాసు మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 12 : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన ఈదా జగన్నాధం(85) కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధ భరించలేక శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఏలూరు క్రైం, జనవరి 12 : ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏలూరు జూట్‌మిల్లు వెనుక రైల్వే బ్రిడ్జి కింద ఒక మృతదేహం ఉన్నట్టు ఏలూరు రైల్వే పోలీసులకు శుక్రవారం రాత్రి సమాచారం అందింది. రైల్వే ఎస్ఐ నరసింహారావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సుమారు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి 5.5 అడుగుల ఎత్తు, ఛామనఛాయ శరీరం కలిగి ఉన్నాడు. రేడియం రంగు పొట్టిచేతుల టీషర్టు, నీలం రంగు జీన్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్



గంజాయి విక్రయదారులను అరెస్టు చేసిన పోలీసులు

తాడేపల్లిగూడెం క్రైం, జనవరి 12: తాడేపల్లిగూడెంలో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని తాడేపల్లిగూడెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీ సాంకేతిక విద్యా సంస్థ సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద గంజాయితో ఉన్న ఆరుగురిని పట్టణ పోలీసులు శుక్రవారం పట్టుకుని వారి వద్ద నుంచి రూ.53280 విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ సుధాకరరెడ్డి తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు.. గేదె మృతి



ప్రమాదానికి కారణమైన లారీ, మృతిచెందిన గేదె

నూజివీడు టౌన్, జనవరి 12: వేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి మహిళను ఢీకొనడంతో ఆమె తీవ్రగాయాల పాలైన ఘటన నూజివీడు మండలం హనుమంతులగూడెంలో జరిగింది. రాజస్థాన్ నుంచి భీమవరానికి కోళ్లమేతతో శుక్రవారం వేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆ సమయంలో పాలు తీసేందుకు గేదె వద్ద కూర్చున్న గ్రామానికి చెందిన బాణావతు జ్యోతిని, గేదెను బలంగా ఢీ కొట్టడంతో గేదె చనిపోగా లారీ కింద ఆమె ఇరుక్కుపోయింది. గ్రామస్థులు ఆమెను అతి కష్టం మీద బయటకు తీసి చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి, అనంతరం విజయవాడ తరలించారు. ఈ ఘటనలో గుడివాడకు చెందిన లారీ డ్రైవర్ వెంకటేశ్వరరావు, క్లీనర్ కల్యాణ్‌కు స్వల్పగాయాలు కాగా వారిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. నూజివీడు రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

నూజివీడు, జనవరి 12: గొల్లపల్లిలో సిటీ కేబుల్ నిర్వహణలో పనిచేస్తున్న రాజేష్(36) కేబుల్ వైర్లను లాగుతున్న తరుణంలో శుక్రవారం 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభంపైకి ఎక్కాడు. ఈ క్రమంలో అతను విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్టు గ్రామస్థులు పేర్కొన్నారు. రాజేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకు ఇళ్లు దగ్ధం

పెంటపాడు, జనవరి 12 : అగ్ని ప్రమాదంలో తాటాకు ఇళ్లు దగ్ధమైన ఘటన ముదునూరులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో చిట్టూరి వెంకన్న తన ముగ్గురు కుమారులతో రెండు పోర్షన్ల తాటాకు ఇంట్లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి వెంకన్న కుటుంబసభ్యులకు తెలుపగా అందరూ బయటకు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో తాడేపల్లిగూడెం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను నిలువరించారు. ప్రమాదంలో రూ.1.50 లక్షల విలువైన సామగ్రితో పాటు ఇంటిని నిర్మించుకునేందుకు అప్పుగా తెచ్చిన రూ.1.50 లక్షల నగదు కూడా అగ్నికి ఆహుతయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.



పెళ్ళి కూతురమ్మ ఆలయం



పెళ్లి కూతురు, పెళ్లి కుమారుడి విగ్రహాలు

అనగనగా ఓ పెళ్లికూతురమ్మ

రేపటి నుంచి మూడురోజుల పాటు పెళ్లి కూతురమ్మ ఉత్సవాలు

ఆచంట జనవరి 12 : ఆ ఊరిపేరు పెళ్ళి కూతురమ్మ చెరువు. ఈ పేరు వినేందుకు, చదివేందుకు ఆసక్తి కలిగిస్తోంది. ఓ పెళ్లి కూతురు పేరుతోనే ఆ ఊరు ఏర్పడింది. ఇది పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం, శేషమ్మ చెరువు పంచాయతీ సరిహద్దులోనూ, పెనుగొండ మండలం దేవ గ్రామం సరిహద్దులోను ఈ గ్రామం ఉంది. ఆ ఊరులో ప్రతిఏటా సంక్రాంతికి మూడురోజుల పాటు పెళ్లి కూతురమ్మకు అనేక మంది భక్తులు వచ్చి కానుకలు సమర్పించి తన భర్త, పిల్లలు, కుటుంబం క్షేమంగా ఉండాలని మొక్కుకుంటారు. కొన్ని దశాబ్దాల నుంచి ఈవిధంగా పూజలు అందుకున్నట్టు తెలుస్తుంది. సంప్రదాయబద్ధంగా సలిమిడి, పానకాల కావిడ్లు, అరటి గెలలు వంటి కానుకలు పెళ్లికూతురమ్మకు సమర్పించి పూజలు చేస్తారు. ఆచంట మండలంతో పాటు పరిసరాల్లోని గ్రామాల నుంచి దర్శించుకోవడానికి భక్తులు వస్తారు.

పొలాల మధ్యలోనే గుడి

కొన్నేళ్ల కిందట అడవిగా వున్న ఈ ప్రాంతం పొలాలు మధ్యగా ఉంది. అప్పట్లో కట్టిన గుడిలో పెళ్లి కుమార్తె తన భర్తను ఒళ్ళో ఉంచుకుని మరణించిన దృశ్యంతో విగ్రహాలు ఉండేవి. 1982లో ఆలయాన్ని పునరుద్ధరించారు. నూతన దంపతులు విగ్రహాల మధ్యలో పాము విగ్రహం ఉంటుంది. ఈనెల 14,15,16వ తేదీల్లో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఆలయ చరిత్ర ఇదీ..

కొన్ని దశాబ్దాల కిందట ఆచంటకు చెందిన ఓ అబ్బాయికి, పెనుగొండకు చెందిన ఓ అమ్మాయికి పెళ్లి కుదిరింది. వీరిది వైశ్య కులంగా చెబుతారు. పెళ్లి పెనుగొండలోని వధువు ఇంట ఏర్పాటు చేశారు. రహదారులు లేని ఆ రోజుల్లో వరుడు తన పల్లకిలో కూర్చుని ఆచంట శేషమ్మచెరువు సమీపం నుంచి పెనుగొండ వెళ్తూ ఒక అటవీ ప్రాంతంలో పామును చంపుతాడు.పెళ్లైన తరువాత ఆచంటకు అదే దారిలో పల్లకిలో భార్యతో వెళ్తూ అదే ప్రదేశంలో మళ్లీ ఆగుతారు. ఆ సమయంలో అతడు చంపిన పాము తల వరుడిని కాటేయడతో చనిపోతాడు. ఇది చూసిన పెళ్లి కుమార్తె బంధువులకు కబురు పెట్టించి అక్కడే నిప్పులు గుండం ఏర్పాటు చేసుకుని భర్త శవంతో పాటు తను కూడా కాలి బూడిదైంది. దీంతో ఆమె జ్ఞాపకంగా ఒక చిన్నగుడి కట్టారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

భీమడోలు, జనవరి 12 : పూళ్ళ గ్రామంలో ఓ వ్యక్తిపై మద్యం సీసాలతో దాడి చేసిన ముద్దాయిని అరెస్టు చేశామని భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ తెలిపారు. పూళ్ళకు చెందిన సిద్దాబత్తుల విఘ్నేశ్వరరావు అనే కుటుంబానికి నూతులపాటి పోలు కుటుంబానికి గతంలో గొడవలు ఉండగా ఆ వివాదంలో విఘ్నేశ్వరరావు అన్నయ్య శంకరం చనిపోయారు. ఈ కేసు కోర్టులో ఉండగా తన అన్నయ్య మరణానికి కారణమైన పోలును హతమార్చాలనే ఉద్దేశంతో ఈనెల పదో తేదీ మధ్యాహ్నం పూళ్ళ బ్రాంది షాపు సమీపంలో పోలుపై బీరు సీసాతో కొట్టి దాడి చేశారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడి విఘ్నేశ్వరరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడారై ఉత్సవం


108 గిన్నెలతో నివేదన

ఏలూరు కార్పొరేషన్, జనవరి 12: ఆర్ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కూడారై ఉత్సవాన్ని నిర్వహించారు. గోదాదేవికి 108 గిన్నెలతో పాయసాన్ని నివేదించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కోసూరి సత్యనారాయణ, మిత్రబృందం కూడారై ఉత్సవాన్ని జరిపించారు. ఆలయ ఈవో నాగం సన్యాసిరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ధర్మకర్తలు తగు ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దుర్గమ్మకు త్రిశక్తి స్వరూపిణి అలంకారం

ఏలూరు కార్పొరేషన్, జనవరి 12: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బావిశెట్టివారిపేట కనకదుర్గాంబకు శుక్రవారం మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి త్రిశక్తి స్వరూపిణిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ధ్వజ స్తంభం వద్ద మహిళలు సామూహిక దీపారాధన చేశారు.

లలితా పీఠంలో అమ్మవారికి పూజలు

కామవరపుకోట, జనవరి 12 : శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితా శ్రీ పీఠంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, విశేష హారతులు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు దుర్గబాబు, సత్య శ్రీనివాసాచార్యులు స్వామివారికి, అమ్మవారికి అభిషేకం నిర్వహించి హారతులు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.

చేబ్రోలు సాయి గాయత్రి అమ్మవారికి విశేష పూజలు

ఉంగుటూరు, జనవరి 12: మండలంలో అమ్మవార్ల ఆలయాల్లో శుక్రవారం విశేష పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. ఉంగుటూరు చల్లాలమ్మ, భద్రకాళీ అమ్మవారితో పాటు చేబ్రోలు సాయి గాయత్రి అమ్మవారికి విశేష పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనం ఇచ్చారు.

కొబ్బరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘ నేతలు

పెదవేగి, జనవరి 12: కొబ్బరి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని విజయరాయిలో కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కొబ్బరి రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. విజయరాయి ఉద్యాన పరిశోధన కేంద్రం దగ్గర జిల్లా ఉద్యానశాఖాధికారి రామ్మోహన్‌ను శుక్రవారం కలసిన కొబ్బరి రైతులు గిట్టుబాటు ధర రాక నష్టాలను చవిచూస్తున్నమని, కొద్దినెలల కిందట ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం విజయరాయిలో కొబ్బరి కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి ఆదుకోవాలని విన్నవించారు. కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కొబ్బరి మద్ధతుధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు. నాఫెడ్, ఆయిల్‌ఫెడ్ ద్వారా విజయరాయిలో కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రైతులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొబ్బరి రైతులు గుడిబండి రమేష్‌రెడ్డి, బి.వెంకటరెడ్డి, పి.రవీంద్ర, నరసింహులు పాల్గొన్నారు.

అపరిశుభ్ర వాతావరణంతో అనారోగ్యం


వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 12: అపరిశుభ్ర పరిసరాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ జె.గోవిందరావు అన్నారు. నగరంలోని లంకపేట, కొత్తపేట అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే ర్యాలీ నిర్వహించారు. చలి వాతావరణంతో కోవిడ్, జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కాళ్లు, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దగ్గేటపుడు తుమ్మేటపుడు రుమాలు వాడాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అనీషా, సిబ్బంది నిర్మల, శ్రీనివాస్, మార్తమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యల్లాప్రగడ సుబ్బారావు సేవలు మరువలేనివి


ఎల్లాప్రగడ చిత్రపటం వద్ద నివాళి

భీమడోలు, జనవరి 12: డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు మానవాళి ఆరోగ్యానికి చేసిన కృషి మరువలేనిదని పీఎంపీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం జయరామ్ అన్నారు. యల్లాప్రగడ సుబ్బారావు జయంతి పూళ్ళ గ్రామం పీఎంపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఎల్లా ప్రగడ సుబ్బారావు సేవలను కొనియాడారు. మండల కో కన్వీనర్ పల్లారావు, సభ్యులు రామారావు, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదివాసీ సమస్యలపై నిరంతర పోరాటాలు చేసిన ధర్మన్న


ధర్మన్న స్థూపం వద్ద నివాళి

బుట్టాయగూడెం, జనవరి 12: ఆదివాసీల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసిన వ్యక్తి ధర్మన్న అన్ని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకుడు పొరండ్ల శ్రీనివాస్ అన్నారు. ధర్మన్న వర్ధంతి సందర్భంగా శుక్రవారం రామనర్సాపురంలో కొండరెడ్లతో కలసి నివాళులర్పించారు. వందల ఎకరాల పోడుభూములను నరికించారని పోడుభూములే ఆదివాసీలకు జీవనాధారమైనట్లు తెలిపారు. మోదీ, జగన్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని పోరాటాల ద్వారా ఎదిరించాలన్నారు. ధర్మన్న ఆశయసాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. వేట్ల లచ్చిరెడ్డి, కె.లత, కె.నాగలక్ష్మి, దుర్గాప్రసాద్, అశోక్ కొండరెడ్లు పాల్గొన్నారు. కాలనీ కోపల్లెలో న్యూడెమోక్రసీ (చంద్రన్న వర్గం) ఆధ్వర్యంలో ధర్మన్న వర్ధంతి నిర్వహించారు.

కొప్పుల వెలమ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

ఏలూరు రూరల్, జనవరి 12: కొప్పుల వెలమ నగర కమిటీ ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. నగర అధ్యక్షుడు భీమవరపు పాపారావు, మరడా నక్షత్రరావు, అల్లు ఉమామహేశ్వరరావు, ఎం.రంగారావు, తంబంగి జగదీష్, లచ్చిరెడ్డి గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 12: సంక్రాంతికి కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ స్లీవజోజి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు సమావేశం నిర్వహించారు. సీఐ రాజేష్ మాట్లాడుతూ కోడిపందేలు, జూదం నివారణకు సహకరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ముఖ్యమైనదని అందరు ఇళ్లల్లో సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

● భీమడోలు: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, జూదం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ బిబి రవికుమార్ హెచ్చరించారు. భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో జూదం అడ్డుకోడానికి చర్యలు చేపట్టామన్నారు. యువత సంప్రదాయ క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. సమావేశంలో భీమడోలు ఎస్‌ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

● కుక్కునూరు: కోడిపందేలు, జూదం వైపు వెళ్లవద్దని ఎస్సై రామకృష్ణ సూచించారు. ప్రజలను ఇబ్బంది పెట్టే హేయమైన చర్యలకు పాల్పడిన, నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

● కామవరపుకోట: మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు, జూదం నిర్మూలనపై రెవెన్యూ, పోలీసుశాఖ సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా ఆటలు, పాటలు, వివిధ పోటీలతో సంక్రాంతి పండుగను జరుపుకోవాలని, సంఘ వ్యతిరేక కార్యకలాపాలైన కోడి పందేలు, జూదాల వద్దకు వెళ్ళవద్దని హెచ్చరించారు. తహసీల్దార్ డీఈ.సత్యనారాయణ, ఎస్‌ఐ జయబాబు, ఆర్‌ఐ కె.రథసారధి, డిటి శేషగిరి, వీఆర్వోలు కంకిపాటి నాగేశ్వరరావు, ఎండి.మెహబూబ్ సాహెబ్, కొయ్యగూర బాబూరావు, రాటాలు, ఎస్.కె.వలీ పాల్గొన్నారు.

సంక్రాంతి కోడిపందేలను అరికట్టండి : ఐద్వా

ఏలూరు టూటౌన్, జనవరి 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, గుండాట, జూదం అరికట్టాలని ఐద్వా నాయకురాలు శ్యామలరాణి కోరారు. జిల్లా ఎస్పీకి శుక్రవారం ఆమె వినతిపత్రం ఇచ్చారు. కోడిపందేలు, జూదంతో అనేక కుటుంబాలు వీధులపాలవుతున్నాయన్నారు. దుర్గాప్రసాద్, లెనిన్, సీహెచ్ రాజేశ్వరి, దుర్గా, హైమావతి, హరీషాదుర్గ, పాల్గొన్నారు.


నగర పాలక సంస్థ ప్రాంగణంలో మేయర్, ఉద్యోగులు


జడ్పీ కార్యాలయంలో చిన్నారులకు భోగిపళ్లు వేస్తున్న పద్మశ్రీ



సెయింట్ థెరిస్సా కళాశాలలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన


దుగ్గిరాల దంతవైద్య కళాశాల విద్యార్థుల సందడి

సంక్రాంతి సందడి

జడ్పీ, మున్సిపల్ కార్యాలయాల్లో సంబరాలు

విద్యా సంస్థల్లో భోగి మంటలు, సాంస్కృతిక ప్రదర్శనలు

ఏలూరు కలెక్టరేట్, జనవరి 12: సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగు నింపాలని, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. జడ్పీ కార్యాలయంలో సీఈవో సుబ్బారావు, అధికారులు, కార్యాలయ సిబ్బందితో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముగ్గుల పోటీలు, భోగిమంటలు, భోగిపండ్లు, హరిదాసు కీర్తనలు, పిండి వంటలు, సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా అధికారులు దుస్తులు ధరించారు. చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీల్లో, సంక్రాంతి వంటకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, పంచాయతీరాజ్ ఎస్ఈ కేదారేశ్వరరావు, శ్రీధర్‌రాజు, గోపాలకృష్ణ, ఏవో, సెక్షన్ సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: సంక్రాంతి పండుగను ఆనందోత్సవాలతో జరుపుకుని ప్రజలంతా సిరిసంపదలతో తులతూగాలని నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, మేయర్ దంపతులు, కార్పొరేటర్లు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుక్కల వాళ్ళు వాయిద్యాలు వాయించి సందడి చేశారు. మెప్మా పీడీ ఇమ్మానియేలు ఆధ్వర్యంలో పాయసం, అరిసెలు, సున్నుండలు, పిండివంటకాలు, తయారు చేశారు. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్ బాపిరాజు, డిప్యూటీ కమిషనర్ రాధ, పాల్గొన్నారు.

● పెదవేగి: దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. దంతవైద్య విద్యార్థినులు కళాశాల ఆవరణను రంగు రంగుల ముగ్గులతో నింపారు. భోగి మంట వేసి, పాటలు పాడుతూ సందడి చేశారు. ముగ్గుల్లో ప్రతిభ కనబర్చిన వారికి కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ బహుమతులు అందించారు.

● ఏలూరు ఎడ్యుకేషన్: దేశ సంప్రదాయాలకు పండుగలు ప్రతీకలని సెట్‌వెల్ సీఈవో ఎండీ.మెహరాజ్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవం, సంక్రాంతి సంబరాలను తెలుగు, హిందీ విభాగాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మెర్సీ యువజనోత్సవ ప్రాధాన్యత వివరించారు. కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ విద్యార్థినులు పండించిన బ్లాక్‌రైస్‌తో తయారుచేసిన వివిధ రకాల వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

● బుట్టాయగూడెం: తెల్లంవారిగూడెంలో సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలను నిర్వహించారు. తెల్లం రాజ్యలక్ష్మి, సర్పంచ్ తెల్లం రాముడు, తెల్లం వెంకటలక్ష్మీ, సోదెం సుధాకర్, తెల్లం దుర్గారావు పాల్గొన్నారు.

● పెదపాడు: వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ముగ్గుల పోటీలు, భోగి మంటలు, హరిదాసుల సంకీర్తనలు, పిండివంటల ప్రదర్శన, బొమ్మల కొలువులు, చిన్నారులకు భోగిపళ్ల వేడుకలు కనువిందు చేశాయి. ఎండీ కె.సాయిరోహిత్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● లింగపాలెం: ధర్మాజీగూడెం జూనియర్ కాలేజ్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ మురళీకృష్ణ, సుజాతకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

● పోలవరం: కొత్తపట్టిసీమలో సర్పంచ్ మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటలు వేసి, సంప్రదాయ కోడి పందేలు వేసి, హరిదాసుకు దానాలు చేశారు. తహసీల్దారు బి.సుమతి, ఎస్సై పవన్‌కుమార్, మైగాపుల దుర్గాప్రసాద్, పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్: రామానగర్‌కాలనీ షిరిడీ సాయిబాబా మందిరం ప్రాంగణంలో చందు సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. మహిళలు ఈ సందర్భంగా గీతాలను ఆలపించి ఆటపాటలు నిర్వహించారు.

● కామవరపుకోట: కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వాసవీ క్లబ్, వనితా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో కె.శ్రీదేవి విజేతలకు బహుమతులు అందజేశారు. వాసవీ క్లబ్, వనితా క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: పట్టణంలోని అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్‌లో యోగా, నడక, జిమ్, వ్యాయామం, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడాకారులు సంయుక్తంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు రంగవల్లులు, భోగి మంట, సంక్రాంతి పిండి వంటలతో వేడుకలు జరుపుకున్నారు. పెన్మత్స రంగరాజు, నంబూరి రామచంద్రరాజు, ప్రాంతీయ రవాణా అధికారి ఎండి మదని తదితరులు పాల్గొన్నారు.




ఏలూరు, బుట్టాయగూడెంలో జయహో బీసీ కరపత్రాలను విడుదల చేస్తున్న నేతలు, కాగుపాడులో టీడీపీ ఎస్సీ సెల్ నేతల నిరసన

బీసీలను అణచివేస్తున్న జగన్ రెడ్డి

టీడీపీ నేతల ధ్వజం

బుట్టాయగూడెం, జనవరి 12: జగన్‌రెడ్డి పాలనలో బీసీలను అణచివేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శేషు అన్నారు. బుట్టాయగూడెంలో శుక్రవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. బీసీలపై దాడులు, అక్రమ కేసులు, హత్యలు పెరిగిపోయాయన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రత్యేక రక్షణ చట్టం తెచ్చి బీసీలను ఆదుకుంటామన్నారు. కొండపల్లి రవి, డోకల నాగేశ్వరరావు, బొడ్డు కృష్ణ, గంగుల నాగు, కోమటి పద్మరాజు గౌడ్, బిర్రా నాగభూషణం, వానపల్లి నాగేశ్వరావు, మాటూరి ముసలయ్య, గుండుబోయిన మురళీకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు అండగా ఉన్న పార్టీ తెలుగుదేశమని నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. ఎన్టీఆర్ కాలనీలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. బీసీల అండతో గద్దెనెక్కిన జగన్ బీసీలపైనే దాడులు, అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. బీసీలంతా చంద్రబాబు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. మాజీ మంత్రి మరడాని రంగారావు, జగదీష్‌బాబు, గంగారాజు, వెంకట్రావు, శ్రీనివాస్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కాగుపాడులో టీడీపీ ఎస్సీ సెల్ నేతల నిరసన

ఉంగుటూరు: ఎస్సీ, ఎస్టీలకు పెద మేనమామ అని చెప్పి తిరిగిన ముఖ్యమంత్రి జగన్ మోసపు రెడ్డి అని టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నేకూరి ఆశీర్వాదం అన్నారు. ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీలకు ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగుపాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరించడానికి మీరు అర్హులు కాదని, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తుంగలోతొక్కారన్నారు. గంటా యువరాజు, చద లవాడు కాంతారావు, ఇర్లపాటి మోషే, జి.గోపి, ఎ.పెద్దిరాజు, బి.శ్రీరాములు, జి.సత్యనారాయణ, సుందరరావు, కె.ప్రసాదు, నాగేంద్ర, సుధీర్, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.




కామవరపుకోట డిగ్రీ కళాశాల, టీడీపీ జిల్లా కార్యాలయం, బుట్టాయగూడెంలో స్వామి వివేకానంద చిత్రపటాల వద్ద నివాళి

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

కామవరపుకోట, జనవరి 12 : యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా జిల్లాలో పలుచోట్ల శుక్రవారం యువజన దినోత్సవం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామకృష్ణ మఠం ద్వారా దేశంలో యువతకు దిశ, నిర్దేశం చేయడమే కాకుండా మన దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, వి.శ్రీనివాస్, ఎం.హర్షవర్ధిని, దారావతు మల్లేష్, బి.రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: ఏటా జాబ్‌క్యాలెండర్ ద్వారా ప్రభుత్వ పోస్టులను భర్తీ చేస్తానని చెప్పిన జగన్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా యువతను మోసం చేశాడని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు రెడ్డి చందు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్, నత్తా నాగేంద్రబాబు, సురేంద్రచౌదరి, గంటా శ్రీను, షేక్ సుభాని, దుర్గాప్రసాద్, వెంకట్రావు, కె.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

యువత స్వామి వివేకానంద మార్గంలో పయనించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగం శివ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగ సురేష్, ముఖేష్, ప్రసాద్, మహేష్, గణపతి, గాది రాంబాబు, పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: నిస్వార్థం, ప్రేమ, ధైర్యం, త్యాగం, సేవాగుణం అలవర్చుకుంటే గొప్పవ్యక్తులు అవుతారని ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. రామకృష్ణాపురంలోని సాహిత్య మండలిలో పుల్లాబొట్ల పురుషోత్తమరావు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. సీఏకేఎస్ స్వామి, పీవీజీ.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు. వైఎంహెచ్‌ఏ ప్రాంగణం లో స్వామివివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు వై.సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, వేణుగోపాల లునాని, వేమా కోటేశ్వరరావు, చెలకోటి వీరయ్య, దువ్వి హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి కె.రామకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు పుస్తకాలను అందజేశారు.

● భీమడోలు: మండలంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భీమడోలులో యువజనోత్సం, మంచెం గోపాలకృష్ణయ్య విగ్రహ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. సర్పంచ్ పాము సునీత మాసింగ్, మంచెం రవీంద్ర గణేష్, ఈతకోట సుబ్బారావు, గ్రామ కార్యదర్శి రాగూర్, పాలేటి బ్రహ్మారావు, అప్పక రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.




చింతలపూడి, కుక్కునూరులో సంతకాలు సేకరిస్తున్న అంగన్వాడీలు, బుట్టాయగూడెంలో రాజకీయ పక్షాల రౌండ్ టేబుల్ సమావేశం

కోటి సంతకాల సేకరణ

అంగన్వాడీల ఆందోళన

బుట్టాయగూడెం, జనవరి 12: అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం అఖిలపక్షాలు, ప్రజా సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుష్ప అధ్యక్షతన వహించిన సమావేశంలో నాయకులు ఎం.నాగమణి, సున్నం నాగేశ్వరావు, తెల్లం రామకృష్ణ, తగరం బాబురావు, పోతురాజు, కారం దారయ్య మాట్లాడుతూ అంగన్వాడీలు నిరవధిక సమ్మె ప్రారంభించి 32 రోజులు కావస్తుందన్నారు. సమస్యలు పరిష్కరించాలని, ఎస్మా ప్రయోగించడం సరైంది కాదన్నారు. విధుల్లో చేరాలని బెదిరించడం దుర్మార్గం అన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే రాజకీయ పార్టీలతో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటామని తెలిపారు. యూనియన్ నాయకులు రామ లక్ష్మి, మారమ్మ, కృపామణి, ఆకాశమ్మ, ఫ్రాన్సిస్, ముత్యాలమ్మ, వినోద్, శ్రీని వాస్, శ్రీను అంగనవాడీలు పాల్గొన్నారు. యూటీఎఫ్ నేతలు మద్దతు తెలిపారు.

● చింతలపూడి: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయు ఆధ్వర్యంలో ప్రదర్శన జరిపి సంతకాల సేకరణ చేపట్టారు. సమ్మె శిబిరం నుండి బోసుబొమ్మ సెంటర్‌కు చేరుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని బోసుబొమ్మ సెంటర్‌లో నినాదాలు చేశారు. నత్తా వెంకటేశ్వరావు, పి.సరోజిని, పద్మ, పాపారత్నం, హేమలత తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: అంగన్వాడీల సమ్మెకు యూటీఎఫ్, ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం తెలిపాయి. సమ్మె శిబిరంలో అంగన్వాడీలు గిరిజన నృత్యాలు చేశారు. పీఎల్ఎస్ కుమారి, చెరుకూరి మణి, పద్మ, సరస్వతి, హైమావతి, కుబ్ర, జుబేద, వెంకటరమణ, సత్యవతి పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఉంగుటూరులో జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం కూడా నిరసనలు కొనసాగాయి. ప్రభుత్వం చర్చలకు పిలవడంతో సఫలమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

● కుక్కునూరు: సమస్యలు పరిష్కరించకుండ నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటని జనసేన నియోజకవర్గ ఇంచార్జి మేక ఈశ్వరయ్య అన్నారు. అంగన్వాడీల కోటి సంతకాల సేకరణ చేపట్టడంతో ఈశ్వరయ్య సంతకం చేశారు. కార్యక్రమంలో యర్నం సాయికిరణ్, కుంజ నాగలక్ష్మి, రమణ, సుజాత, పార్వతి, మహాలక్ష్మి, వందన, మంగ, రాధ, జానకి, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: అంగన్వాడీల సమ్మెకు న్యాయవాదులు విస్సంపల్లి సుందరరావు, మన్నెం వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగం హేయమైన చర్య అన్నారు. మార్తమ్మ, పనివర్ధిని, సత్యవతి, బాబీ, అనుమోలు మురళి, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: అంగన్వాడీలు కొత్త కోర్కెలు కోరలేదని, జగన్ ఇచ్చిన హామీలనే అమలు చేయాలంటున్నారని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన సమావేశం జరిగింది. నెలరోజులుగా రోడ్లపై అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుంటే కనీసం మహిళలు అనే కనికరంలేకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించమంటే ఎస్మా చట్టం ప్రయోగించడాన్ని ఖండించారు. అంగన్వాడీల సమ్మె బలపరుస్తూ కోటిసంతకాల సేకరణలో రాజకీయపార్టీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. బండి వెంకటేశ్వరరావు, చోడే వెంకటరత్నం, కాశీ నరేష్‌బాబు, వెంకట్రావు, రమేష్‌బాబు, షేక్ మస్తాన్, డీఎన్‌వీడీ.ప్రసాద్, సోమయ్య, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: అంగన్‌వాడీలు తక్షణం విధుల్లో చేరాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు నోటీసులు పంపించారు. అంగన్‌వాడీలు తీసుకోకపోవడంతో ఇంటివద్ద, అంగన్‌వాడీ కేంద్రం వద్ద గోడలకు అతికించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, వీఆర్వో అమర్నాద్, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.జ్యోతి శుక్రవారం అంగన్‌వాడీల ఇళ్ళకు నోటీసులు అంటించారు. దీనిపై అంగన్‌వాడీల కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ఉంటే అంగన్‌వాడీ కేంద్రంలో చూసుకోవాలే తప్ప మా ఇంటికి నోటీసులు అంటించవద్దని అభ్యంతరం తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

'చింతమనేని ప్రభాకర్ విజయానికి కృషి చేస్తాం'

పెదవేగి, జనవరి 12: తామంతా మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెంటే ఉన్నామని, వచ్చే ఎన్నికల్లో ఆయన గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషి చేస్తామని దెందులూరు నియోజకవర్గ నాయకులు స్పష్టం చేశారు. వ్యక్తిగత స్వార్థంకోసం ఒకరిద్దరు అసమ్మతి గళం వినిపిస్తున్నారని, వారిపై పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకుంటుందన్నారు. దుగ్గిరాలలో చింతమనేని ప్రభాకర్ ఇంటి వద్ద శుక్రవారం విలేకరుల సమావేశంలో బొప్పన సుధాకర్, మోరు శ్రావణి, మాగంటి నారాయణప్రసాద్, తాతా సత్యనారాయణ, నాగరాజు మాట్లాడారు. పార్టీ నిబంధనలు అతిక్రమించిన ఎవరినైనా అధిష్ఠానం ఉపేక్షించబోదన్నారు. కనీసం సొంత గ్రామంలో మనుగడ లేని, పార్టీలో సభ్యత్వం లేని వ్యక్తులు సమన్వయ కమిటీ సమావేశం అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్లకు పెద్ద జెండాలు కట్టుకు తిరిగితే నాయకులు కాలేరని, కష్టంలో ఉన్న కార్యకర్తలకు అండగా నిలిచేవారే నాయకులన్నారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన కూటమి ప్రజల్లో బలంగా దూసుకుపోతోందని, కుప్పకూలుతున్న వైసీపీకి పరోక్షంగా సాయం చేసేలా కొంతమంది చర్యలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులంతా ప్రభాకర్ వెంటే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థిగా చింతమనేని ఒక్కరే ఉంటారని, ఆయన విజయం ఖాయమని నాయకులు పునరుద్ఘాటించారు. గారపాటి రామసీత, పరసా వెంకటరావు, మాదు రవికుమార్, కొనకళ్ళ శివమణి, గుత్తా అనిల్, ముమ్మడి చింతయ్య, సక్కుకుమారి, తలకొండ జమలయ్య, మంచినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ విరాళంతో శ్మశాన వాటిక నిర్మాణం



భువనపల్లిలో నిర్మించిన శ్మశాన వాటిక

నిడమర్రు, జనవరి 12: మండలంలోని భువనపల్లి సర్పంచ్ పదవి ఏకగ్రీవం కావడంతో గ్రామాభివృద్ధికి కిలారి సత్యవతి, రవిబాబు దంపతులు హామీ ఇచ్చారు. గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న శ్మశాన వాటిక అభివృద్ధి చేశారు. సుమారు రూ. 39 లక్షలతో శ్మశాన వాటికను ఆధునీకరించారు. శనివారం కలెక్టర్‌తో ప్రారంభిస్తామని సర్పంచ్ కిలారు సత్యవతి రవిబాబు తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ఏలూరు కార్పొరేషన్

ఏలూరు టూటౌన్, జనవరి 12: స్వచ్ఛసర్వేక్షన్ 2023లో మెరుగైన పనితీరు కనబరిచిన ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఓడీఎఫ్ ప్లస్ ర్యాంకు సాధించింది. గతంతో పోలిస్తే వంద స్థానాలు ఎగబాకింది. గత ఏడాది 325వ ర్యాంకు వస్తే ఇప్పుడు 223వ ర్యాంకు సాధించింది. లక్షకు పైబడిన 32నగరాల్లో 12వ స్థానం సాధించింది. పారిశుధ్య నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించినట్లు కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు.

సరోగసీ క్లినిక్‌ల నమోదుకు సూచనలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 12: జిల్లాలో సరోగసీ క్లినిక్‌లు నేషనల్ రిజిస్ట్రీలో నమోదుచేసుకోవాలని జిల్లా వైద్యాధికారి శర్మిష్ట సూచించారు. నిర్ణీత రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, నేషనల్ రిజిస్ట్రీలో నమోదు కాని క్లినిక్‌లను చట్టవిరుద్ధమైనవిగా పరిగణించి సీజ్‌చేస్తామని హెచ్చరించారు. గర్భస్థపిండ లింగ నిర్ధారణచేసిన క్లినిక్‌లకు, సహకరించిన వైద్యులకు గరిష్ఠంగా రూ.50వేల జరిమానా, ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తారని స్పష్టం చేశారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు టూటౌన్ :** వర్షాలు, తుఫాన్‌తో పంట కోల్పోయిన రైతులు, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, బీ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం డీఆర్వోకి వినతిపత్రం సమర్పించారు.
- నూజివీడు ప్రాంతంలో పేదలసాగులో ఉన్న 10వేల ఎకరాలకు తక్షణమే భూహక్కుపత్రాలు అందజేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగగింది.
- **పెదపాడు :** దాసరిగూడెం పరిసరాల్లో పోలీసులు దాడి చేసి 13 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి రూ.15,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపారు.
- **జంగారెడ్డిగూడెం టౌన్ :** హ్యూమన్ రైట్స్ మిషన్ జిల్లా అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ సభ్యులతో డీఎస్పీ ధనుంజయుడును కలసి సత్కరించారు. హనుమంతరావు, కృష్ణబాబు, రాధాదేవి పాల్గొన్నారు.
- **బుట్టాయగూడెం :** మెరకగూడెంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జరిగింది. పీఎంఈవై, ఆయుష్మాన్ భారత్ కార్డులు, ప్రధాన మంత్రి జీవనజ్యోతి, జననీ సురక్ష వివరించారు. దెయ్యాల రామాంజనేయులు, సోము హరినారాయణ పాల్గొన్నారు.
- **ఏలూరు టూటౌన్ :** బుట్టాయగూడెం మండలంలోని కామవరంలో గిరిజన యువత ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంటు పోటీలను నిర్వహిస్తున్నారు. న్యూడెమోక్రసీ నాయకుడు ధర్ముల సురేష్ ప్రారంభించారు. 16 టీమ్‌లు పోటీలో పాల్గొంటున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు కోర్స గంగరాజు, కారం లక్ష్మీ, కొవ్వాసు గోవిందరాజు, కారం రాఘవ, యు.ఏసుబాబు, ఎస్.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.
- **లింగపాలెం :** రంగాపురం, నరసన్నపాలెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ఆశీర్వాదం, పలువురు బీజేపీ నాయకులు కేంద్ర పథకాలు వివరించారు. ఆర్ఎస్ఎస్ చక్రధర్‌రావు, ఒంటెద్దు ఏసువరప్రసాద్, యాంజిలో దిడ్లా పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** నల్లమాడులో లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వంది రాంబాబు, నల్లమాడు ఉప సర్పంచ్ ఇల్లిందల సురేష్, గౌతు రాజేష్, సత్యనారాయణ, సతీష్, యుగంధర్, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.



కైకలూరులో సంతకాలను సేకరిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు



నూజివీడులో చేతులు కట్టుకుని అంగన్‌వాడీల నిరసన



ముసునూరు దీక్షా శిబిరంలో ప్రార్థనలు చేస్తున్న అంగన్‌వాడీలు

కోటి సంతకాల సేకరణ

» ఉద్యమాన్ని ప్రారంభించిన అంగన్వాడీలు

» 32వ రోజు వినూత్న ప్రదర్శనలు

కైకలూరు, జనవరి 12: సమస్యలు పరిష్కరించే వరకు ఉధృతంగా ఆందోళనలు చేస్తామని అంగన్వాడీలు హెచ్చరించారు. శుక్రవారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు 32వ రోజు ధర్నా నిర్వహించారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేశారు. బీసీ నాయకుడు లావేటి వీరశివాజీ శిబిరానికి సంఘీభావం తెలిపి సంతకం చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు పి. సుజాత, ఎల్ మీనాకుమారి, విజిత, ఝాన్సీ, రమణ, ఉష తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా శుక్రవారం కలిదిండిలో అంగన్‌వాడీ నేతలు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. అబిదా బేగం, రమాదేవి, మేనక లక్ష్మీ, సత్యవతి, వెంకటేశ్వరమ్మ, సరస్వతి, సుజాత పాల్గొన్నారు.

చేతులు కట్టుకుని నిరసన

నూజివీడు: కట్టుబానిసలుగా ప్రభుత్వం తమను చూస్తోందంటూ అంగన్‌వాడీలు చేతులు కట్టేసుకుని నిరసన తెలిపారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరసనదీక్షలు శుక్రవారం 32వ రోజుకు చేరుకున్నాయి. అనంతరం సీఎం జగన్‌కు తమ వాణిని వినిపించేలా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఆర్ హనుమాన్లు, జి.రాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించు దేవుడా...

ముసునూరు: సీఎం జగన్‌రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించాలని అంగన్‌వాడీలు శుక్రవారం ప్రార్థనలు చేశారు. ముసునూరు సచివాలయం వద్ద అంగన్‌వాడీలు దీక్ష చేపట్టి 32వ రోజుకు చేరడంతో 32 అంకె ఆకృతిలో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ప్రభుత్వానికి అంగన్‌వాడీల సత్తా ఏమిటో ఎన్నికల్లో చూపిస్తామని వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి హెచ్చరించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయి తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు తమ డిమాండ్లసాధన కోసం 32వ రోజు ఆందోళన కొనసాగించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో మానవహారం..

ముదినేపల్లి, జనవరి 12 : నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం ముదినేపల్లిలో అంగన్‌వాడీలు మానవహారం నిర్మించి నినాదాలు చేశారు. దీంతో ముదినేపల్లి - బంటుమిల్లి రహదారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. యూనియన్ నాయకులు సొంగా మణి, బండి పద్మ, అరుణ కుమారి, రిబ్ పా తదితరుల నాయకత్వంలో మానవహారం నిర్వహించగా, బీజేపీ ఓబీసీ విభాగం నాయకుడు లావేటి వీర శివాజీ సంఘీభావం తెలిపారు.

మండవల్లిలో మోకాళ్లపై నిలబడి..

మండవల్లి: మండవల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్షలో అంగన్వాడీలు శుక్రవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఆడబిడ్డలు మోకాళ్లపై నిల్చున్నా ప్రభుత్వం స్పందించడం లేదని అంగన్వాడీ యూనియన్ నాయకులు చెల్లమ్మ, విజయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ

» ద్విచక్ర వాహనం నడుపుతున్న బాలుడ్ని ఆపి వాహనం సీజ్



చాట్రాయి, జనవరి 12: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించటానికి అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి చెప్పారు. శుక్రవారం తెలంగాణ సరిహద్దులో గల కృష్ణారావు పాలెం చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం, అక్రమ రవాణా కాకుండా చెక్‌పోస్టులలో విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఎస్పీ తనిఖీలు చేస్తుండగా ఓ బాలుడు ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఆపి ఆ వాహనాన్ని సీజ్ చేయాలని ఆదేశించారు. ఆమె వెంట నూజివీడు రూరల్ సీఐ బాలసురేష్, ఎస్సై స్వామి ఉన్నారు.

టీడీపీ కార్యకర్తలకు బెయిల్

నూజివీడు సబ్ జైలులో కార్యకర్తలకు తెలిపిన చిన్ని



నూజివీడు టౌన్, జనవరి 12: నూజివీడు సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న తిరువూరు టీడీపీ కార్యకర్తలకు శుక్రవారం బెయిల్ మంజూరైంది. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకుడు కేశినేని చిన్ని ఏలూరు జిల్లా నూజివీడు సబ్ జైలుకు చేరుకుని రిమాండ్‌లో ఉన్న వారికి ఆ విషయం తెలిపి ఆనందాన్ని పంచుకు న్నారు. సంక్రాంతికి ముందే 10 మంది కార్యకర్తలు విడుదల సంతోషకర మన్నారు. కొందరు సంఘవిద్రోహుల చర్యల వల్ల టీడీపీ కార్యకర్తలు అరెస్ట్ జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కృషి చూస్తామన్నారు.

మహేష్ అభిమానులతో జయమంగళ చిందు



కైకలూరు, జనవరి 12: సినీ హీరో మహేష్‌బాబు అభిమానులతో ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ నృత్యం చేస్తూ వారిని ఉత్సాహపరిచారు. శుక్రవారం మహేష్‌బాబు చిత్రం విడుదల సందర్భంగా కైకలూరు వెంకట రమణ థియేటర్ వద్ద కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న జయమంగళ మహేష్ అభిమానులతో పాటు డ్యాన్స్ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి

మండవల్లి, జనవరి 12: రబీలో ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించేందుకు రైతుల్లో చైతన్యం తీసుకురావాలని మండవల్లి మండల వ్యవసాయ శాఖ అధికారిణి షేక్ జరీనా పేర్కొన్నారు. మండవల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీ సాగులో ఈ క్రాప్ విధానం, ప్రకృతి వ్యవసాయం, మినుము సాగులో సస్యరక్షణపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ కూరేళ్ళ యేసు మరియమ్మ, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతానికి ఒకరి మృతి

నూజివీడు, జనవరి 12: గొల్లపల్లిలో సిటీ కేబుల్ నిర్వహణలో పనిచేస్తున్న రాజేష్(36) కేబుల్ వైర్లను లాగుతున్న తరుణంలో శుక్రవారం 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభంపైకి ఎక్కాడు. ఈ క్రమంలో అతను విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. రాజేష్ భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి రూరల్ ఎస్సై టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

ఘటనా స్థలంలోనే గేదె మృతి

నూజివీడు టౌన్, జనవరి 12: వేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి మహిళను ఢీకొనడంతో ఆమె తీవ్రగాయాల పాలైన ఘటన నూజివీడు మండలం హనుమంతులగూడెంలో జరిగింది. రాజస్థాన్ నుంచి భీమవరానికి కోళ్లమేతతో శుక్రవారం ఉదయం వేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆ సమయంలో పాలు తీసేందుకు గేదె వద్ద కూర్చున్న హనుమంతులగూడెం గ్రామానికి చెందిన బాణావతు జ్యోతిని, గేదెను బలంగా ఢీ కొట్టడంతో గేదె ఘటనా స్థలంలోనే చనిపోగా లారీ కింద జ్యోతి ఇరుక్కుపోయింది. గ్రామస్థులు ఆమెను అతి కష్టం మీద బయటకు తీసి చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం బాధితురాలిని విజయవాడ తరలించారు. ఘటనలో లారీ డ్రైవర్ గుడివాడకు చెందిన వెంకటేశ్వరరావు, క్లీనర్ కల్యాణ్‌లకు స్వల్పగాయాలు కాగా వారిని నూజివీడు ఏరియాఆసుపత్రికి తరలించారు. నూజివీడు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

ముదినేపల్లి, జనవరి 12 : పుట్టింటికి వెళతానన్న వివాహిత అదృశ్యమైన ఘటన ముదినేపల్లి మండలం చేవూరుపాలెంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పి.గోవిందు రాజులుకు ఉయ్యూరుకు చెందిన పల్లవి (20)తో 8 నెలల క్రితం వివాహమైంది. గురువారం పల్లవి తాను పుట్టింటికి వెళుతున్నానని అత్తవారికి చెప్పి సింగరాయపాలెంలో మచిలీపట్నం బస్సు ఎక్కింది. అయితే ఆమె పుట్టింటికి రాలేదని తెలియడంతో భర్త గోవిందరాజులు ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ పద్మజ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

180 మంది బైండోవర్

ముసునూరు, జనవరి 12: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, ఇతర జూద క్రీడలు జరగకుండా ముందస్తుగా పాత ముద్దాయిలను బైండోవర్ చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. శుక్రవారం నాటికి మండల పరిధిలో కోడి పందేల నిర్వహణ, కోడి కత్తుల తయారీ, కోళ్లకు కత్తులు కట్టేవారు 180 మంది పాత ముద్దాయిలను బైండోవర్ చేసినట్లు తెలిపారు. సంప్రదాయం ముసుగులో కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

నిష్పక్షపాతంగా వైద్యం చేయండి : ముద్దరబోయిన



నూజివీడు, జనవరి 12: రాజకీయాల కతీతంగా వైద్యులు నిష్పక్షపాతంగా తమ సేవలను అందించాలని నూజివీడు నియోజ కవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు సూచించారు. ప్రత్యర్థుల దాడిలో గాయపడిన ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి గ్రామానికి చెందిన మోర్ల చిన కొండలరావుకు ఆస్పత్రిలో సరైన వైద్యం అందించటం లేదనే ఆరోపణలపై ముద్దరబోయిన నూజివీడు ఏరియా ఆసుపత్రికి వెళ్ళి బాధితుడిని పరామర్శించగా వైద్య పరీక్ష చేయలేదని, ఒక్క మందు బిళ్ళ కూడా ఇవ్వలేదని బాధితుడు ముద్దరబోయినకు తెలిపాడు. అనంతరం నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్యులతో ముద్దరబోయిన మాట్లాడగా బాధితునికి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ఎటువంటి తారతమ్యాలు చూడమని ఆయనకు వివరించారు. ఆగిరిపల్లి, నూజివీడు నూజివీడు పట్టణం, టీడీపీ అధ్యక్షులు మల్లవల్లి కోటేశ్వరరావు, ముసునూరు రాజా, మల్లిశెట్టి జగదీష్, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మండా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను విస్మరించిన వైసీపీ



కలిదిండి, జనవరి 12 : నిరుద్యోగ యువతను వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం కోరుకొల్లులో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత చదువులను అభ్యసించిన యువతకు ఉపాధి అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించటమే చంద్రబాబు లక్ష్యమని, టీడీపీ గెలుపునకు యువత కృషి చేయాలని కోరారు. టీడీపీ నాయకులు తోట వీరాంజనేయులు, నల్లిబోయిన భోగేశ్వరరావు, జనసేన నాయకులు వలవల రమేష్, చెన్నంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై మురుగునీటి తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కలిదిండి, జనవరి 12 : మట్టగుంట దళితవాడలో శుక్రవారం రహదారిపై నిల్వ ఉన్న మురుగు నీటిని పంచాయతీ అధికారులు తొలగించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో డ్రైనేజీలోంచి పైపులైన్.. రహదారిపైనే మురుగు నీరు కథనానికి అధికారులు స్పందించారు. డ్రైనేజీ తూము లోపల ఉన్న పైపులైన్ తొలగించారు. డ్రైనేజీలో నీరు పారేలా పూడిక తీయటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ అంద్రాజు రత్నమణి, పంచాయతీ కార్యదర్శి నాగబాబు, అంద్రాజు దుర్గారావు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

ముదినేపల్లి, జనవరి 12 : 'ఆంధ్రలో ఒక్కసారి - కేంద్రంలో మరొక్కసారి బీజేపీ సర్కార్' కార్యక్రమాన్ని నాయకులు ముదినేపల్లి మండలంలో శుక్రవారం నిర్వహించారు. పార్టీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల కమిటీ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి ఆధ్వర్యంలో పోస్టర్లను ఏర్పాటు చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కార్నర్ మీటింగ్‌లో కృష్ణారావు అన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ బైఠాయింపు

సమావేశానికి రమ్మని తాళం వేసి ఉండడంతో ఆగ్రహం



నూజివీడు టౌన్, జనవరి 12: సమావేశానికి రమ్మని పిలిచి తీరా వచ్చేసరికి సచివాలయాలకు తాళం వేసి ఉండడంతో ఉపసర్పంచ్ సచివాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపాడు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడు గ్రామ సచివాలయం పంచాయతీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తనకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారని వెళితే 11.30 వరకు తలుపులు తీయలేదని, ప్రశ్నిస్తే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో ప్రత్యేక విధులు నిర్వర్తిస్తున్నామంటూ కార్యదర్శి సురేంద్ర చౌదరి తాపీగా సమాధానం చెప్పారని ఉప సర్పంచ్ కలగర శివసాయి సచివాలయం వద్ద బైఠాయించారు. అనంతరం సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు తిరిగి ఫోన్‌లో సమాచారం ఇచ్చారే కాని విధులు, బాధ్యతలు మాత్రం ఆయన మరిచిపోతున్నారంటూ ఉప సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల వినియోగంలోనూ సమాచారం అడిగితే ఇవ్వడం లేదని, ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని ఆయన తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సురేంద్ర చౌదరిని వివరణ కోరగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో ప్రత్యేక విధులు కేటాయించడంతో తాను దిగవల్లి వెళ్ళాల్సి వచ్చిందని అనివార్య కారణాల వల్ల సమాచారం ఇవ్వలేకపోయానని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



పేదలకు జనసేన వితరణ

కైకలూరు, జనవరి 12: పేదలు సంతోషంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని 9 రకాల నిత్యావసర వస్తువులను అందజేస్తున్నట్లు జనసేన సమన్వయకర్త బీవీ రావు తెలిపారు. శుక్రవారం కైకలూరు శ్రీ శ్యామలాంబ కళా మండపం వద్ద 700 మంది పేదలకు నిత్యావసర వస్తువులను అంద జేశారు. జనసేన ఏలూరు, దెందులూరు నాయకులు రెడ్డి అప్పలనాయుడు, ఘంట సాల విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



ముదినేపల్లి, జనవరి 12 : పెయ్యేరు శివారు అప్పారావు పేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయురాలైన పరసా స్వరాజ్యలక్ష్మి కుటుం బానికి శుక్రవారం మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, టీడీపీ నాయకుడు వీరమల్లు సత్యనారాయణ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు, బీసీ సెల్ కార్యదర్శి పరసా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మానవత చేయూత



కలిదిండి, జనవరి 12 : చినపుట్ల పూడికి చెందిన అగ్నిప్రమాద బాధి తుడు శీల నాగేశ్వరరావు కుటుంబీకులకు మానవత అధ్యక్షుడు గోదావరి సత్యనారాయణ రూ.5 వేలు నగదు, దుస్తులు, మూల్లంక సర్పంచ్ మహదేవ విజయ్, సొసైటీ చైర్మన్ నామాని అన్నవరం రూ.2 వేలు ఆర్థిక సాయమందించారు. మానవత సేవా సంస్థ చైర్మన్ పేటేటి వివేకానంద స్వామి, రత్నారావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

18వ రోజుకు న్యాయవాదుల దీక్షలు

నూజివీడు టౌన్, జనవరి 12: ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుచేయాలని న్యాయవాదులు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరుకున్నాయి. నూజివీడు కోర్టు హాలు వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, సీనియర్ న్యాయవాదులు వాకా రాజ్‌కుమార్, మంకెన నరసింహారావు, బసవ రాజురామకృష్ణ, కేవీ చలపతి తదితరులు దీక్ష చేపట్టారు.

శోభనగిరిలో కూడార్రై



ఆగిరిపల్లి, జనవరి 12: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కూడార్రై ఉత్సవం వైభవంగా జరిగింది. స్వామి, గోదాదేవికి విశేష పూజలు, 108 గంగాళాలతో ప్రసాద నివేదన జరిగింది. ఆగిరిపల్లి వాసవీ మహిళా మండలి, భక్త బృందం పాల్గొంది. ఆలయ కార్యనిర్వహణ అధికారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయని ఆలయ ప్రధానార్చకులు వేదాంతం శేషబాబు తెలిపారు.

వెలుగు కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు

ముసునూరు, జనవరి 12: సంప్రదాయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు డి.పద్మావతి అన్నారు. శుక్రవారం ముసునూరు వెలుగు కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. వీవోఏలు, కార్యాలయం సిబ్బంది, డ్వాక్రా మహిళలకు ముగ్గులు, ఆటలపోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. సీసీలు సుజాత, లలిత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు అక్కిరెడ్డిగూడెం జట్టు



ముసునూరు, జనవరి 12: ముసునూరు జడ్పీ పాఠశాలలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు హోరాహోరీగా సాగాయి. కబడ్డీలో లోపూడి-అక్కిరెడ్డి గూడెం జట్లు సెమీ ఫైనల్స్‌లో తలపడగా అక్కిరెడ్డిగూడెం ఫైనల్‌కు చేరింది. ఈ నెల 20న గుళ్ళపూడి-అక్కిరెడ్డి గూడెం జట్ల మధ్య ఫైనల్స్ జరుగుతాయని పీడీ అలీఖాన్ తెలిపారు. 17 నుంచి క్రికెట్ పోటీలు జరుగుతాయని పీడీ తెలిపారు. ఎంపీడీవో జి.రాణి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పోటీలను పర్యవేక్షిస్తున్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి



ముదినేపల్లి, జనవరి 12 : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. ముదినేపల్లిలో శుక్రవారం మండల స్థాయి ఆడుదాం - ఆంధ్రా ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. వాలీబాల్ పోటీలు జరిగాయి. అంతకు ముందు ముదినేపల్లి-1 గ్రామ సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొని పలువురిని హెల్త్ కార్డులు అందజేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేశ్వరి పలువురు నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు



నూజివీడు, జనవరి 12: పలు అభివృద్ధి కార్యక్రమాలను నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు శుక్రవారం ప్రారంభించారు. నూజివీడు మండలం తూర్పు దిగవల్లి, పోతురెడ్డిపల్లి రహదారి అభివృద్ధితో పాటు మండలంలోని మర్రిబంధం, ఎంఎస్‌పాలెం రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు తూర్పుదిగవల్లి గ్రామ సచివాలయ భవనాలను, ఆర్బీకేని ఆయన ప్రారంభించారు. కృష్ణా జడ్పీ వైస్ చైర్మన్ గుడిమెళ్ళ కృష్ణంరాజు, పల్లె రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గస్తీ ముమ్మరం

ముదినేపల్లి, జనవరి 12 : సంక్రాంతి సందర్భంగా ముదినేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జూద క్రీడలకు బ్రేక్ వేసేందుకు పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. మహిళా పోలీసులను, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ వెంకట్ కుమార్ ఆధ్వ ర్యంలో పోలీసు నిఘా బృందాలు గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లపై సమాచారం సేకరిస్తున్నారు. కోడిపందేలకు బరులు సిద్ధమవుతున్నట్లు స్థానిక పోలీసులు గుర్తించారు. బరుల నిర్వహణకు సంబంధించి పలువురికి ఇప్పటికే ఎస్ఐ వెంకట్ కుమార్ ముందస్తు నోటీసులు జారీ చేశారు. మండలంలో సుమారు 140 మంది పాత నేరస్థులు, కోడిపుంజులకు కత్తులు కట్టే వారిని బైండోవర్ చేశారు. బరులు ఏర్పాటు చేస్తే ధ్వంసం చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.



కైకలూరులో వివేకానంద విగ్రహానికి టీడీపీ నాయకుల నివాళి





చాట్రాయి, ముదినేపల్లిలో స్వామి వివేకానందకు నివాళులు



మండవల్లి మండలం చింతపాడులో..

నేటి తరానికి ఆదర్శం స్వామి వివేకానంద

జయంతి వేడుకల్లో వక్తల నివాళి

కైకలూరు, జనవరి 12: స్వామి వివేకానంద ఆశయాలు నేటి తరం ఆచరించాలని విశాఖకు చెందిన వివేకానంద సహప్రచారక్ జనార్దన్ అన్నారు. శుక్రవారం కైకలూరు రామకృష్ణాసేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుండి బైక్ ర్యాలీగా మండవల్లి మండలం చింతపాడు వెళ్లి వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం కైకలూరులో జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కైకలూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల టీచర్ అనసూయ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ వివేకానంద బోధన లు అనుసరించి మెలిగితే ప్రజల్లో దేశభక్తి, సన్మార్గం వైపు పయనిస్తారన్నారు. అలాగే టీడీపీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ర్యాలీగా వెళ్లి టీటీడీ కల్యాణమండపం వద్ద వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యులు విజయలక్ష్మి, తెలుగుయువత నాయకులు పూల రామచంద్ర రావు, దావు నాగరాజు, తెలుగు మహిళ నాయకురాలు లక్ష్మీరాణి, జిల్లా వాణి జ్య విభాగం అధ్యక్షుడు బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు జానీ, నాయకులు కారుణ్య, ఎస్సీసెల్ నాయకుడు వీరాబత్తిన సుధా తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయి జడ్పీ పాఠశాలలో వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివేకానందుడు చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో రిటైర్డ్ పంచాయతీ ఈవో అడవి ప్రసాద్ ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహానికి ఎంపీడీవో పి.మల్లీశ్వరి, ఏవో రమణ బాబు, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందుడి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

కలిదిండి: కలిదిండి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో దినతేజ్ వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవి పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని చింతపాడులో వివేకానంద విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఓబీసీ రాష్ట్ర నాయకుడు లావేటి వీరశివాజీ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ వివేకానంద ఆశయాలు మహోన్నతమని నేటి తరానికి ఆయన ఆదర్శమన్నారు. కైకలూరు జడ్పీటీసీ మాజీ సభ్యురాలు విజయలక్ష్మి, రామకృష్ణ సేవా సమితి కమిటీ సభ్యులు, ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు.